రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- రూ.45 లక్షలతో పలు అభివృద్ధి పనులు
- అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సూచన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. అభివృద్ధి పనుల్లో స్థానిక ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ హిందూ శ్మశాన వాటికిలో రూ.15 లక్షలతో నిర్మించ తలపెట్టిన ప్రహరీ నిర్మాణ పనులు, కుమ్మరి బస్తీలో రూ.30 లక్షలతో టైల్స్ అభివృద్ధి పనులను కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు.

- అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గాభివృద్ధి కోసం గతంలో ఏ రాజకీయ పార్టీ చేయని అభివృద్ధి ఈ ఐదేళ్లలో అన్ని డివిజన్‌లలో కోట్లాది రూపాయలు కేటాయించి అభివృద్ధికి బాటలు వేశామన్నారు.
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సైతం ముషీరాబాద్ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ప్రజలకు రహదారి మార్గంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి వీఎస్‌టీ వరకు స్టీల్ బ్రిడ్జి నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.
- కార్పొరేట్ స్థాయిలో పేదలకు వైద్యసేవలు అందించేందుకు ప్రతి బస్తీలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేసి అనేక రకాల వైద్య పరీక్షలకు సౌకర్యం కల్పించామన్నారు.
- నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములైతే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు.
- నాలా పరివాహక ప్రాంతంలో నివాసం ఉండే వారు ఇళ్లు కోల్పోకుండా నాలాకు ఇరువైపులా రిటర్నింగ్ వాల్‌ను నిర్మించడం, వర్షాకాలంలో వరదలు రాకుండా నాలాలో పూడికతీత పనులు వేగవంతం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు సన్నీ సుభాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్‌గంగపుత్ర, కేశవరాజు, పరశురాం, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్‌డీ సాయికృష్ణ, బీఆర్ఎస నేతలు ముచ్చకుర్తి ప్రభాకర్, రాజశేఖర్‌గౌడ్, కిరణ్‌కుమార్, రాజేష్, రాంచందర్, రాజుయాదవ్, శ్యామల ప్రభాకర్, వాసు, దుర్గాస్వామి, హరి, శివ, వల్లాల రవియాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. 10 లక్షలతో అభివృద్ధి పనులు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

నల్లకుంట: సీఎం కేసీఆర్ నాయకత్వంలో అంబర్‌పేట నియోజక వర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. దీనిలో భాగంగానే నియోజక వర్గంలోని ఆయా ప్రాంతాల్లో దశల వారీగా అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో నియోజక వర్గంలో పార్కుల అభివృద్ధి, సుందరీకరణ పనులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. శుక్రవారం బాగ్ అంబర్‌పేట డివిజన్ కుమ్మరివాడిలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. త్వరితగతిన పనులను పూర్తిచేసి ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే సమయంలో అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌ఎస్‌పీడీసీఎల్-11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ ఎం.విజయ్‌భాస్కర్ తెలిపారు. నారాయణగూడ ఫీడర్ పరిధిలో నారాయణగూడ, గౌరమ్మ గల్లి, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, సూర్యనగర్, బాగ్‌లింగంపల్లి, అరోరా డిగ్రీ కళాశాల, దత్తానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

విశ్వ మానవాళి శ్రేయస్సు ఠాగూర్ సాహిత్యం

చిక్కడపల్లి: దేశాల మధ్య సరిహద్దులు, ప్రజల నడుమ ఎలాంటి బేధాలు లేని మానవాళి శ్రేయస్సు లక్ష్యం రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్యమని రాష్ట్ర సమాచార హక్కు చట్టం విశ్రాంత ప్రధాన కమిషనర్ బుద్ధ మురళి అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలోని లలిత కళావేదికపై ఠాగూర్ సంస్మరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మురళి మాట్లాడుతూ.. దేశ ప్రజల స్వేచ్ఛ స్వాతంత్ర్య ఆకాంక్షతో 'వేర్ ద మైండ్ ఈస్ విత్‌ఔట్ ఫియర్' గీతాన్ని రాసినా ఠాగూర్ ప్రపంచ సాహిత్యవేత్తలలో ఒకరని నోబెల్ బహుమతి అందుకున్న తొలి భారతీయుడు ఠాగూర్ అని కొనియాడారు.

- జాతీయగీతంతో పాటు శాంతినికేతన్ విద్యాలయం గీతాంజలి సంపుటిని ఠాగూర్ దేశానికి అందించారన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన వేదికపై కళాపోషకుడు వెంకట్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు సత్యనారాయణమూర్తి, గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న శ్రీనాథ్‌గౌడ్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఆలయ వ్యవస్థాపక వంశీయులు శ్రీనాథ్‌గౌడ్, ఈఓ కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. విశ్వక్సేన పూజ, రక్షా బంధనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, హవనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహానివేదన, మంత్ర పుష్పం నిర్వహించారు.

నేడు ధ్వజారోహణం..

- శనివారం ఉదయం పఠాదినము, హవనము, బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచకంగా ధ్వజారోహణం ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు భేరిపూజ, దేవతాహ్వానం, హవనము, బలిహరణం, రాత్రి శేషవాహనసేవ తదితర కార్యక్రమాలను చేపడుతున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి


స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వ్యాపారులు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం నల్లకుంటలో సన్ ఎడ్జ్ హెల్త్ కేర్ ప్రోడక్ట్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో రోజు రోజుకు ఆహారధాన్యాలు, ప్రజలు వినియోగించే నిత్యావసర వస్తువుల్లో నాణ్యత లోపించడంతో వినియోగదారులు మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ కేర్, బ్యూటీ, అగ్రి ప్రోడక్ట్స్, ఫుడ్ ప్రోడక్ట్స్, పర్సనల్ కేర్, బ్యూటీ థెరఫీ, హోమ్‌కేర్ తదితర వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, సన్‌ఎడ్జ్ నర్సింహ్మారావు, కవిత, ఉత్తమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు !


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గుంతలమయంగా మారిన రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. శుక్రవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక బస్తీల్లో కార్పొరేటర్ పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని ఆమె సూచించారు. జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, బీజేపీ నేతలు భీమ్‌రాజ్, ఆండాలమ్మ, రామకృష్ణ, రాము, ఎస్.రవియాదవ్, ఓంప్రకాష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎంహెచ్‌ఈయూ మాజీ అధ్యక్షుడికి నివాళి

నల్లకుంట: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్‌ఈయూ) మాజీ అధ్యక్షుడు దివంగత బూర రవి వర్ధంతిని నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో నిర్వహించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ రవి చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. ఆయన మరణం మెడికల్ ఉద్యోగులకు తీరని లోటన్నారు. యూనియన్ ఫీవర్ ఆసుపత్రి అధ్యక్షురాలు కె.లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి పద్మజ, చంద్రశేఖర్, నజ్మా, యష్మిన్, నిర్మల, షబాణ, లక్ష్మమ్మ, భాగ్య, నరేందర్, అబ్బాస్, శ్రీకాంత్, నళిని, రాజు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అన్నమయ్య కీర్తనలు తెలుగు భాష సంపద


కార్యక్రమంలో పాల్గొన్న కేవీ రమణాచారి, వనజ ఉదయ్, ఫణీంద్ర, వసుంధర తదితరులు

చిక్కడపల్లి: తెలుగు జాతీయాలు అచ్చ తెలుగు మాండలీకాలతో అన్నమయ్య కీర్తనలు తెలుగు భాష సంపద అని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. శుక్రవారం త్యాగారాయ సభ ప్రధాన వేదికపై షష్ఠి పూర్తి చేసుకున్న నవ్యనాటిక సమితి, అన్నమాచార్య మిషన్ సంయుక్తంగా తాళ్లపాక 9 మంది నాట్యగురువులు, శిష్యబృందం 94 మంది ఆంధ్ర నాట్యం భరత నాట్య రీతులలో అన్నమయ్య కీర్తనలు కనుల పండువగా సభికులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా రమణాచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్నమయ్య కీర్తనలు గానగోష్ఠిలోనే కాకుండా నృత్య ప్రక్రియలలోనూ ప్రజలు, కళాకారులకు చేరువచేస్తున్నారని ఈ సందర్భంగా అభినందించారు. వందల ఏళ్లు గడిచినా అన్నమయ్య కీర్తనలు నిత్య నూతనమని నిరూపించారన్నారు. నాట్య గురువులు వనజ ఉదయ్, కవి ఆచార్య ఫణీంద్ర, పే అండ్ అకౌంట్స్ అధికారిణి జి.వసుంధర, డాక్టర్ చంద్రశేఖర్, విశ్వనాథ్‌లు పాల్గొన్నారు. అనంతరం ఎన్ఎన్‌ఎస్ అధ్యక్షులు వేమరాజు విజయ్‌కుమార్ స్వాగతం పలుకగా సుధామాల, గోదాలక్ష్మిల నిర్వహణలో నాట్యగురువులు, అతిథులను సత్కరించారు.

నేడు అంతర్జాతీయ కవిసమ్మేళనం

చిక్కడపల్లి: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వంశీ ఇంటర్నేషనల్ సాంస్కృతిక కళాసారధి సింగపూర్ శుభోదయం సంస్థల సంయుక్తాధ్వర్యంలో శనివారం సాయంత్రం 12 దేశాల నుంచి 75 మంది కవులు కవయిత్రులతో 'అంతర్జాతీయ కవిసమ్మేళనం' వంశీ రామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకం 102వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. దీనికి పింగళి వెంకయ్య మనుమడు జీవీఎస్ నరసింహం జ్యోతి ప్రకాశం గావిస్తున్నారన్నారు. భారత్ నుంచి ప్రముఖ కవులు కవయిత్రులతో పాటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, ఒమాన్, ఖాతర్, బహ్రెయిన్, యూకే, దక్షిణాఫ్రికా, కెనడా, అమెరికా, దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొని దేశ జాతీయ సమైక్యత విశిష్టతపై తమ కవితలు వినిపించనున్నారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అధ్యక్షులు డాక్టర్ వంగూరి చిట్టెన్‌రాజు, సింగపూర్ నుంచి సాంస్కృతిక కళాసారధి వ్యవస్థాపకులు కవుటూరు రత్నకుమార్ తమ ప్రసంగాలను అందిస్తారని సమాచారం. రాధిక మంగిపూడి ప్రధాన సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు.

హక్కుల కోసం పోరాటం చేయాలి


మాట్లాడుతున్న బూర్గుల వెంకటేశ్వర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలోని మాల, అనుబంధ కులాల వారు రాజ్యాంగ పరమైన హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దేశంలో రిజర్వేషన్‌లు ఎత్తివేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దీనిలో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. అణగారిన ప్రజలు, ప్రజాస్వామిక వాదులంతా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దమ్మ రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దారా యోబూ, అనిల్, నారాయణ, రాజేష్, మల్లేష్, తిరుమల్లేష్, నర్సింగ్‌రావు, మధుకర్, కృష్ణయ్య, గాజుల నాగరాజు తదితరులున్నారు.

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సీబీఐ, సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి


సమావేశంలో వైఎస్‌ఆర్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిలతో ఆకుల ప్రవీణ్

కవాడిగూడ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఐటీశాఖపై విచారణ చేపట్టాలని వైఎస్‌ఆర్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల పోలీస్ అధికారులకు మంత్రి కేటీఆర్‌పై ఫిర్యాదు చేశారు. శుక్రవారం ముషీరాబాద్ నియోజకవర్గ వైఎస్‌ఆర్‌టీపీ కో-ఆర్డినేటర్ ఆకుల ప్రవీణ్ ఈ కార్యక్రమంలో పాల్గొని ఆమె పోరాటానికి సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ చేసి లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. దీనిపై అనేక సార్లు వైఎస్‌ఆర్‌టీపీ ఆందోళనలు చేసిందన్నారు. పేపర్ లీకేజీ కేసును సీబీఐకి లేదా సిట్టింగ్ జడ్జీచే విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కలుషిత నీటి సరఫరాను అరికట్టింది బీఆర్‌ఎస్ పార్టీనే !



ర్యాలీ చేపడుతున్న భోలక్‌పూర్ డివిజన్ వాసులు

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గం భోలక్‌పూర్ డివిజన్‌లో 2009 మే 5న కలుషిత తాగునీటి సరఫరాతో 14 మంది ఆ నీటిని తాగి మృత్యువాతపడ్డారని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుతూ.. ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు జైసింహ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ భోలక్‌పూర్ డివిజన్‌లో అభివృద్ధి పనుల కోసం కోట్లాధి రూపాయలు కేటాయించారన్నారు.

- నిత్యం కలుషిత తాగునీటి సరఫరాతో సతమతమవుతున్న భోలక్‌పూర్ బస్తీ వాసులకు కలుషిత నీరు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కోసం నూతన పైపులైన్‌లను రూ.30 కోట్లతో నిర్మించారన్నారు.
- డ్రైనేజీ, రహదారుల సౌకర్యం కోసం కోట్ల రూపాయలు కేటాయించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.
- తెలంగాణ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. ఆదుకుంటుందని పేర్కొన్నారు.
- గత ప్రభుత్వాలు చేయలేని అనేక అభివృద్ధి పనులను బీఆర్‌ఎస్ పార్టీ 9 ఏళ్లు పూర్తి చేసుకుని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందన్నారు. ర్యాలీలో రహీం, చాంద్‌పాషా, శంకర్‌గౌడ్, మక్బుల్, పాషా, అక్బర్ అలీ, దస్తగిరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 8న కాంగ్రెస్ నిరుద్యోగ బహిరంగ సభ

కవాడిగూడ: టీపీసీసీ ఆధ్వర్యంలో ఈ నెల 8న 'కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్' పేరుతో నిర్వహించే నిరుద్యోగ సభను నిర్వహిస్తున్నామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్‌ముదిరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద నిరుద్యోగ సభను విజయవంతం చేయాలని కోరుతూ.. ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నిరుద్యోగ భారీ బహిరంగ సభకు రాష్ట్రానికి తొలిసారిగా ప్రియాంక గాంధీ హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ నాయకులు నాగసాయి, ఉదయ్, రాజు, రాములు, శ్రీనివాస్, సాయి, ఆనంద్, రఘురాం, రాజేష్, మధు తదితరులున్నారు.


మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం.నాగేష్‌ముదిరాజ్

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


బీఆర్‌ఎస్ సీనియర్ నేత శేషును అభినందిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత, కాచిగూడ డివిజన్ మాజీ అధ్యక్షుడు శేషు జన్మదినం సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. పార్టీకి కార్యకర్తలే పునాది వంటి వారని వారి అభివృద్ధి, సంక్షేమానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ అందేలా పార్టీ నేతలు, కార్యకర్తలు చూడాలన్నారు. పార్టీ నేతలు దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బబ్లూసింగ్, అంటోని, మహేష్ తదితరులున్నారు.

'హార్ట్ బీట్' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కంచె ఐలయ్య తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ న్యాయవాది ఎం.విప్లవ్‌కుమార్ రచించిన 'హార్ట్ బీట్' పుస్తకాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ కంచె ఐలయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. తన జీవిత అనుభవాలను వైవిధ్య భరితంగా వ్యాసాల రూపంలో రాయడం అభినందనీయమన్నారు. విద్యార్థి నాయకుడిగా పనిచేసిన అనుభవంతో పాటు న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ.. సమాజంలో జరుగుతున్న అనేక అంశాలను ఈ పుస్తకంలో వివరంగా రాశారన్నారు. ఇలాంటి పుస్తకాలు సమాజానికి ఎంతో అవసరమని పాఠకులను ప్రేరేపించే విధంగా ఇలాంటి మరెన్నో పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. ఈ పుస్తకాన్ని తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యానికి అంకితం ఇచ్చారు. మోదుగుపూల ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ పుస్తకావిష్కరణలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, అరుణోదయ సమైఖ్య అధ్యక్షురాలు, ప్రజాగాయని విమలక్క, ఎ.విజయ్‌కుమార్, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

నేడు నాయిని నర్సింహ్మారెడ్డి మెమోరియల్ క్రికెట్ పోటీలు


బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఎండీ ఆజామ్‌అలీ, ట్రస్ట్ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివంగత తెలంగాణ తొలి హోంశాఖ మంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి మెమోరియల్ క్రికెట్ పోటీలను ఈనెల 6న ఉదయం 9 గంటలకు ఇందిరాపార్కు వద్ద గల ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రికెట్ పోటీలకు సంబంధించిన వివరాలను ప్రకటించారు.

ఆకట్టుకున్న 'నవరత్నమాల' సామూహిక సంకీర్తన


అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న అకాడమీ విద్యార్థులు

నల్లకుంట: వాగ్గేయ కారుడు తాళ్లపాక అన్నమాచార్యుల 615వ జయంత్యుత్సవాలను సందర్భంగా శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో 'నవరత్న మాల' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలిండియా రేడియో, దూరదర్శన్ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో 100 మంది అకాడమీ విద్యార్థులు అన్నమయ్యకు అర్పించిన సామూహిక సంకీర్తనార్చన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది.

- ఈరోజు సాయంత్రం గోధాసమేత మన్నార్ రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంలో సామూహిక సంకీర్తనల గానం ఉంటుందని నిర్వాహకులు ప్రకటించారు.

సింపోజియాలతో సృజనాత్మకత

ఉస్మానియా యూనివర్సిటీ: సింపోజియాలతో ఇంజినీరింగ్ విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఈసీఈ విభాగంలో ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సింపోజియానికి హాజరై సావనీర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొ.రామకృష్ణ, డా.నవీన్, స్టూడెంట్ కోఆర్డినేటర్ రుత్విక్‌రెడ్డి, సి.అభిచందన పాల్గొన్నారు.

'గాంధీ'లో ఆరుగురు కాంట్రాక్టు సిబ్బందికి క్రమబద్ధీకరణ



గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఫార్మాసిస్ట్‌లతో కలిపి మొత్తం ఆరుగురిని రెగ్యులర్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతన సచివాలయం ప్రారంభం సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లోని 40 విభాగాలలో పనిచేస్తున్న 5544 మంది కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేస్తూ ఫైల్‌పై సీఎం కేసీఆర్ సంతకం చేసిన సంగతి విదితమే. ఈ మేరకు గాంధీఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిన ఫార్మాసిస్ట్ గ్రేడ్-2లుగా పనిచేస్తున్న అనురాధ, అంబుజా, స్వప్న, నవీన్, ల్యాబ్ టెక్నీషియన్ శోభారాణి, ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్‌రెడ్డిలను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించనున్నారు. గత 22 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న తమకు ఇప్పటికి రెగ్యులరైజ్ కావడం సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, డీఎంఈ రమేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ రాజారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారు

అడ్డగుట్ట: బీఆర్‌ఎస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు ప్రత్యామ్నాయ పార్టీగా బీజేపీని కోరుకుంటున్నారని బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు, వాల్ పెయింటింగ్ డివిజన్ ఇన్‌చార్జ్ గెల్లు ఉదయ్ యాదవ్ అన్నారు. శుక్రవారం అడ్డగుట్ట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గోడలపై కమలం గుర్తును వేశారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని రెండేళ్లలోపే వందల కోట్లు వెచ్చించి సెక్రటేరియట్ నిర్మించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం, పేద ప్రజలకు డబుల్ బెడ్రూమ్ ఇవ్వలేకపోతుందన్నారు. రాష్ట్రంలోనే సమస్యలను పరిష్కరించలేని కేసీఆర్ దేశాన్ని మారుస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటికీ తిరిగి గోడలకు కమలం గుర్తు వాల్ పెయింటింగ్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సాయిబాబా, రాజేష్, మంద సురేష్, నందు పాల్గొన్నారు.


గోడపై కమలం గుర్తు వేస్తున్న బీజేపీ నాయకులు

మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు



ముషీరాబాద్/కాచిగూడ/కవాడిగూడ/నల్లకుంట/చిక్కడపల్లి : టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సికింద్రాబాద్ మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని రెయిన్ బో హోమ్ చిన్నారులకు ఆల్పాహారం అందజేశారు.